భవానీమాతగా భద్రకాళి



భద్రకాళి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆరో రోజు భవానీ మాతగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యాహ్నికం, అభిషేకాలు నిర్వహించారు. భద్రకాళి అమ్మవారిని భవానీ మాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. కాత్యాయని దుర్గార్చన, చిన్న అమ్మవారికి గంధోత్సవం చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి సాలభంజిక సేవ జరిగింది.

– న్యూస్‌టుడే, రంగంపేట



ఉత్సవమూర్తికి సాలభంజిక సేవ

కుడా.. బడా!

- పరిధి పెంపునకు ప్రతిపాదనలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) సరసన త్వరలో వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) నిలవనుంది. 'కుడా' పరిధి విస్తరించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి.. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపించారు. త్వరలోనే అనుమతి వచ్చే అవకాశం ఉంది. 'కుడా' పరిధి పెంపుతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పెరిగే అవకాశాలున్నాయి. అనంతరం గ్రేటర్ వరంగల్ పరిధి పెంపుపై నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం పెద్దది. నగర విస్తరణతో పాటు సమగ్రాభివృద్ధి కోసం ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్) సిద్ధమవుతోంది.



హనుమకొండలోని కార్యాలయం

ప్రస్తుతం ఇలా..

- 'కుడా' విస్తీర్ణం 1805 చదరపు కిలో మీటర్లు
- వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని 19 మండలాలు, 181 గ్రామాలు
- **మండలాలు:** భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, కాజీపేట, ఖిలావరంగల్, వరంగల్, వేలేరు, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం, వర్ధన్నపేట, చిల్పూరుగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్

ఎమ్మెల్యేల సుముఖత

'కుడా' పరిధి పెంపునకు స్థానిక ఎమ్మెల్యేలు సైతం అంగీకరించినట్లు తెలిసింది. అధికారికంగా లేఖలు కూడా ఇచ్చారని సమాచారం. గతనెల హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.


అదనంగా కలిసేవి..

- కొత్తగా 1050 చదరపు కిలో మీటర్ల విస్తరణ
- అదనంగా మరో 8 మండలాలు, 95-100 గ్రామాల విలీనం
- జనగామ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, హుజూరాబాద్ పురపాలక సంస్థలతో పాటు 8 మండలాలు ప్రతిపాదించారు.
- జనగామ, హుజూరాబాద్ మండలాలు 'కుడా'లో కలిపేందుకు ప్రజాప్రతినిధుల నుంచి కొంత వ్యతిరేకత ఉందని తెలిసింది.
- 'కుడా' పరిధి పెంపునకు సంబంధించిన అన్ని రకాలైన మ్యాప్‌లు, ఇతర వివరాలు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపించారు. మున్సిపల్ శాఖ సీఎం వద్ద ఉండటంతో ఒకేసారి రెండు ఆమోదాలు లభిస్తాయని అధికారులంటున్నారు.

సద్దుల బతుకమ్మకు విస్తృత ఏర్పాట్లు

రంగంపేట, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో సద్దుల బతుకమ్మ పండగకు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. భద్రకాళి, హనుమకొండ వడ్డేపల్లి చెరువును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దేశాయిపేట చిన్నవడ్డేపల్లి, శివనగర్, రంగశాయిపేట బెస్తం చెరువు, ఖిలావరంగల్ గుండు చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న, గణేశ్‌నగర్, ఉర్సు రంగసముద్రం, కాజీపేట బంధం, హనుమకొండ పెద్ద వడ్డేపల్లి చెరువుతో పాటు విలీన గ్రామాల్లోని చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించామన్నారు. ఈ నెల 12న భద్రకాళి తటాకంలో జరిగే భద్రకాళి భద్రేశ్వరుల తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు మేయర్ సుధారాణి తెలిపారు. ఉర్సు రంగలీలా మైదానంలో జరిగే రావణ వధ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

గురుతర బాధ్యత మీదే..!



జిల్లాలవారీగా భర్తీ కానున్న పోస్టులు

జిల్లా	స్కూల్‌అసిస్టెంట్లు	ఎస్‌జీటీ	భాషాపండితులు	పీఈటీ	స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్‌ఏ)	స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్‌జీటీ)	మొత్తం
హనుమకొండ	73	81	5	7	4	17	187
జనగామ	50	118	21	7	5	20	221
భూపాలపల్లి	41	152	20	7	4	13	237
మహబూబాబాద్	71	264	19	2	5	20	381
ములుగు	33	125	16	1	3	14	192
వరంగల్	66	182	21	6	5	21	301

నేడు డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు

ఉపాధ్యాయుల్లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో బడులకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త గురువులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బాటలు వేయాలి. నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో బడుల్లో వారి పాత్ర ఎలా ఉండాలో వివరిస్తూ 'ఈనాడు' ప్రత్యేక కథనం..

ఈనాడు, మహబూబాబాద్-న్యూస్‌టుడే, భూపాలపల్లి



హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ విజేతలు

ఆదర్శంగా నిలవాలి ఇలా..

సొంతంగా ఖర్చుచేస్తూ..



ఈ ఉపాధ్యాయుడు రేగూరి సుభాకర్‌రెడ్డి.. భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు ప్రత్యేకంగా ఐడీ కార్డులు తయారు చేయించారు. 14 మంది విద్యార్థులు ఉపకార వేతన పోటీ పరీక్ష రాయగా సొంతంగా ఫీజు చెల్లించారు. విద్యార్థిని అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే.. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి పెరిగేలా కృషి చేశారు. సొంతంగా ఖర్చు చేసి స్కూల్ బ్యాగులు, షూ, నిఘంటువులను అందించారు.

సౌర వెలుగులు అందించి..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐత తిరుపతి 14 అటవీ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంపులు పంపిణీ చేశారు. రాత్రి వేళ చదువుకునేలా విద్యా వెలుగులు అందించారు. అమెరికాలోని మిత్రుడి సాయంతో విద్యా సామగ్రి, 77 మంది పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రాథమిక పాఠశాలలు కొత్తగా రానున్న సార్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ కొత్త గురువులతో భర్తీ కానున్నాయి. 922 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడిబాగుకు పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి.

భాషలో రాణించేలా..

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు అంటే విద్యార్థులు భయపడు తున్నారు. విధుల్లో చేరబోతున్న 102 మంది భాషా పండితులు ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు, వంటి వాటితో భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడల్లో వెలుగొందాలి

వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ చేపట్టడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 30 మంది విధుల్లో చేరనున్నారు. ఇకపై మైదానాలు కళకళలాడాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేయాలి.

'సబ్జెక్టు'పై పట్టు సాధించేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా ఇంకా కొరత నెలకొంది.. ఇకపై ఆ సమస్య ఉండదు. కొలువుదీరనున్న 334 మంది స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతి పాఠ్యాంశాన్ని మూలాల్లోకి వెళ్లి బోధించాలి. కృత్యాధార, ప్రయోగాత్మకమైన బోధన చేయాలి.

ప్రత్యేక 'బోధన'కు పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో ఎంతో కాలంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బోధకుల్లేక అవస్థలు పడ్డారు. ఇకపై వారికి మంచి రోజులే.. వారి కోసమే 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 105 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరనున్నారు. 'ప్రత్యేక' అవసరాలను గుర్తించి వారిలో మానసిక వికాసాభివృద్ధి జరిగేలా దోహదపడాలి.

రామ రామ ఉయ్యాలో..!



వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరన్నంటాయి. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆడిపాడారు. మేయర్ గుండు సుధారాణి, జిల్లా పాలనాధికారి డా.సత్యశారద, కమిషనర్ డా. అశ్విని తానాజీ, మహిళా కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగినులు ఆటపాటలతో సందడి చేశారు. తీరొక్క పూలతో బతుకమ్మలను సుందరంగా అలంకరించారు.

– న్యూస్‌టుడే, కార్పొరేషన్



మహిళా కార్పొరేటర్లు

ఒలింపిక్ పతకం ఇదే..!



హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మంగళవారం పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు దీప్తితో స్వీయ చిత్రాలు తీసుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా పారిస్‌లో సాధించిన కాంస్య పతకాన్ని చూసిన బాలికలు ఒలింపిక్ పతకం ఇదేనా అంటూ మురిసిపోయారు. నిరంతరం సాధన చేస్తే ఒలింపిక్ పతకం సాధించవచ్చని దీప్తి వారిలో స్ఫూర్తి నింపారు. – న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితా సిద్ధం

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో 263 మంది ఉపాధ్యాయులు ఎంపికైనట్లు డీఈఓ ఎ.జ్ఞానేశ్వర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎంపికైన ఉపాధ్యాయుల తుది జాబితాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వివరించారు. జిల్లాలో 301 పోస్టులకు 263 మందిని ఎంపిక చేశామన్నారు. వివిధ విభాగాల్లో అభ్యర్థులు లేకపోవడంతో 18 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.. అర్హులైన ఉపాధ్యాయులకు సమాచారం అందించి డీఈవో కార్యాలయంలో గుర్తింపుకార్డులు అందజేశారు. బుధవారం ఉదయం 7గంటలకు కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించడానికి ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. జాబితా అలస్యంపై కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిపై అసహనం వ్యక్తం చేశారు.

మిల్స్‌కాలనీ సీఐగా వెంకటరత్నం



రంగశాయిపేట, న్యూస్‌టుడే: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సీఐగా వెంకటరత్నం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన మల్లయ్యను ఐజీకి అటాచ్ చేయడంతో 15 రోజులుగా సీఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మహబూబాబాద్, పరకాల ప్రాంతాల్లో సీఐగా పనిచేసిన వెంకటరత్నంను ఇక్కడికి బదిలీ చేశారు.

ఓరుగల్లులో వాడ్రా భయం..!

తప్పుడు ప్రచారంతో ప్రజల్లో భయాందోళన

గిర్మాజీపేట, న్యూస్‌టుడే

హైడ్రా(హైదరాబాద్ విపత్తుల ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ) మాదిరిగా జిల్లాలో 'వాడ్రా' పేరిట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఇళ్లు కూల్చివేస్తారని ప్రచారం జరుగుతోంది. దీంతో నగరంలోని పలు కాలనీవాసులు భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మంగళవారం వరంగల్ ఎస్సార్‌నగర్‌లో బతుకమ్మ ఆటస్థలం పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్ ఇక్బాల్‌ను స్థానికులు కొందరు అడ్డుకున్నారు. ఇళ్లు కూల్చివేస్తారనే తప్పుడు ప్రచారం జరగడంతో.. తహసీల్దార్ సర్వే కోసమే వస్తున్నారని స్థానిక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. తమ ఇళ్లను కూల్చొద్దని కొందరు మహిళలు తహసీల్దార్‌ను అడ్డుకొని కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. కొంతసేపు ఆయన కారును కదలనివ్వలేదు. దీంతో తన విధులకు ఆటంకం కలిగించిన వారిపై తహసీల్దార్ ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భూ కబ్జాలో కొత్త కోణం..

వరంగల్ ఎస్సార్‌నగర్‌లోని సర్వే నంబరు 195 రామసముద్రం శిఖం భూమిని అయాన్ (ప్రభుత్వ భూమి)గా మార్చి.. అక్కడ గుడిసెలు వేసుకున్న స్థానికులకు గత ప్రభుత్వం రెండుపడక గదుల ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ఇళ్ల నిర్మాణం తర్వాత మిగిలిన ప్రభుత్వ భూమిపై కొందరి కన్నుపడింది. ఇంటి నంబర్లపై రిజిస్ట్రేషన్లు చేస్తూ.. అక్రమంగా ఇతరులకు విక్రయిస్తూ.. రూ. లక్షల్లో లబ్ధి పొందుతున్నారు. ఈ క్రమంలో సుమారు 20.05 గుంటల ప్రభుత్వ స్థలంలో స్థానికులు కొందరు బతుకమ్మ వేడుకలు జరుపుకొనేందుకు స్థానిక ఎమ్మెల్యేను అనుమతి కోరడంతో.. అందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ కబ్జాలో ఉన్న స్థలం ఎక్కడ తిరిగి ప్రభుత్వ పరమవుతుందోననే భయాందోళనతో.. అక్రమార్కులు స్థానికులను వాడ్రా పేరుతో రెచ్చగొట్టారు. శిఖం భూమిలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇళ్లను కూల్చేందుకే తహసీల్దార్ ఇక్కడికి వస్తున్నారని తప్పుడు ప్రచారం చేశారు. ఈ విషయం తెలియని స్థానికులు తహసీల్దార్‌ను అడ్డుకున్నారు.



వెనుతిరిగి వెళుతున్న తహసీల్దార్ ఇక్బాల్

2021 నివేదిక.. ఇప్పుడు వైరల్..

హైదరాబాద్ కార్పొరేషన్, ఇతర మున్సిపాలిటీల్లో నాలాలు, చెరువులు విచక్షణారహితంగా ఆక్రమణకు గురవుతున్నాయని.. 2021లో ఈనాడులో వచ్చిన కథనాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటాగా తీసుకుని విచారణకు ఆదేశించింది. అప్పటి కలెక్టర్ గ్రేటర్ వరంగల్ పరిధిలో నాలాలు, చెరువు శిఖం భూములను కబ్జా చేసి నిర్మించిన ఇళ్ల వివరాలకు సంబంధించిన నివేదికను హరిత ట్రిబ్యునల్‌కు సమర్పించారు. ఆ నివేదిక ప్రస్తుతం.. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నివేదికలో ఉన్న ఇళ్లను అధికారులు కూల్చివేస్తారనే ప్రచారం జరుగుతోంది.

- ఈ విషయంపై తహసీల్దార్ ఇక్బాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. అది గతంలో ఇచ్చిన నివేదిక మాత్రమేనని.. ఆ నివేదికను అనుసరించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు తమకు రాలేదని స్పష్టం చేశారు.



కారుకు అడ్డం తిరిగి ప్రాధేయపడుతూ..

అడ్డుకున్న వారిపై కేసు నమోదు..

తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎస్సార్‌నగర్‌లో బతుకమ్మ ఉత్సవాల ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించేందుకు తహసీల్దార్ ఇక్బాల్ అక్కడికి వెళ్లారు. స్థానికంగా ఉండే కేతిరి రాజశేఖర్, కేతిరి లావణ్య అక్కడి ప్రజలకు.. ఇళ్లు కూల్చేస్తారని తప్పుడు సమాచారం ఇచ్చి.. అధికారులను అడ్డుకునేలా రెచ్చగొట్టారు. అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రాజశేఖర్‌పై కేసు నమోదు కావడంతో మాజీ ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌తో బేరసారాలకు దిగినట్లు సమాచారం.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

వరంగల్ తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించి, దాడికి యత్నించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రాములు డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

వీడియో కాల్ చేస్తారు.. కొల్లగొడతారు!



● కమిషనరేట్‌లో ఈ ఏడాది 41 కేసులు

ఈనాడు, వరంగల్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

'హలో మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం'.. అంటూ వీడియో కాల్ వస్తుంది. అందులో సీబీఐ కార్యాలయం, బోర్డులు కనిపిస్తాయి. మాట్లాడేవారు ఖాకీ దుస్తుల్లో ఉంటారు.. మీ అబ్బాయిని అరెస్టు చేశామని, లేదా మీరు హవాలా మార్గంలో పెట్టుబడి పెట్టినందుకు కేసు నమోదు చేసి.. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మొదట బెదిరిస్తారు. ఆ తర్వాత కేసు నుంచి బయటపడాలంటే అడిగినంత ఇవ్వాలంటూ రూ.లక్షల్లో డిమాండు చేస్తారు. ఇటీవల ఉమ్మడి వరంగల్‌లో అనేక మందికి ఇలా వీడియో కాల్స్ వచ్చాయి. సీబీఐ, ఈడీ, ఏసీబీ.. ఇలా అనేక రకాల పేర్లతో సామాన్యులకు వీడియో కాల్ చేసి బెదిరిస్తూ రూ.వేలు, లక్షల్లో వసూలు చేస్తున్నారు.

కొత్త దారులు వెతుకుతూ..

సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు నేరాలకు పాల్పడేందుకు కొత్త దారులు వెతుకుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో చరవాణులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా లింకులు పంపించి, మల్టీలెవల్ మార్కెటింగ్, ఓటీపీ సంఖ్యలు తెలుసుకుని లేదా డెబిట్, క్రెడిట్ కార్డులు, బహుమతులు వచ్చాయని, తక్కువ ధరకు వస్తువుల విక్రయిస్తామని మోసాలకు పాల్పడేవారు. తాజాగా సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, పోలీసు, ఏసీబీ అధికారుల పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు.

పిల్లల పేరు చెప్పి..

పిల్లలు ఇతర దేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుతుంటే వారిపై డ్రగ్స్ లాంటి కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం తమ అదుపులో ఉన్నారని, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిన ఖాతాలకు డబ్బులు పంపిస్తే వెంటనే విడుదల చేస్తామని.. లేదంటే అరెస్టు చేస్తామని బెదిరించడంతో ఆందోళనకు చెంది డబ్బులు నష్టపోతున్నారు.

సమాచారం ఇలా సేకరిస్తారు

సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నెంబర్, ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అనేక రకాలుగా సాంకేతికతను వినియోగిస్తున్నారు. పలు బ్యాంకులు, వివిధ సంస్థలు, మాల్స్ నుంచి ఖాతాదారులకు సంబంధించిన డేటా సేకరిస్తున్నారు. లేదా మహిళలతో కొన్ని నెంబర్లకు ఫోన్ చేయించి వివరాలు తెలుసుకుంటారు. కొద్దిరోజుల తర్వాత సైబర్ నేరాలు చేసేందుకు వాడుతున్నారు.

ఈ ఏడాది కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్‌లో వీడియో కాల్ కేసులు : 41

మొత్తం సైబర్ కేసులు 748

ఉమ్మడి వరంగల్‌లో నమోదైన మొత్తం సైబర్ కేసులు 1215

మోసపోతే ఫిర్యాదు చేయాల్సిన నెంబర్ 1930

నేరుగా కేసులుండవు

కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు నేరుగా కేసులు నమోదు చేయవు.. న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితులుగా ఎవరైనా ఉన్నా వాట్సాప్, వీడియో కాల్స్ చేయరు. చట్ట ప్రకారం నిందితులకు నోటీసు పంపిస్తారు. ఇలాంటి పేర్లతో కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్ కార్డు నంబర్లు చెప్పవద్దు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.



సైబర్ నేరాలపై వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం వారు ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సు

మన దగ్గర అనేక ఘటనలు

● గత నెలలో జనగామ జిల్లాలో పని చేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించి అస్తులున్నాయని, మీరు లంచం తీసుకున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేసేందుకు ప్రయత్నించారు. కొంతమంది వీరికి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టారు.

● మూడు రోజుల క్రితం హనుమకొండకు చెందిన పారిశ్రామిక వేత్తకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సీబీఐ అధికారులమంటూ రూ.28.50 లక్షలు కాజేశారు.

● హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళకు ఇటీవల ఒక వీడియోకాల్ వచ్చింది. ఆమె ఫోన్ ఎత్తగానే 'హలో మేం సీబీఐ ముంబయి నుంచి మాట్లాడుతున్నామని, మీ అబ్బాయిని మరో నలుగురితో కలిసి అరెస్టు చేశాం' అని చెప్పారు. ఆమె ఒక్కసారిగా కంగుతిన్నా తర్వాత తేరుకున్నారు. అబ్బాయి హైదరాబాద్‌లో హాస్టల్ ఉంటే ముంబయిలో ఎలా అరెస్టు చేస్తారని రాంగ్ కాల్ అని పెట్టేశారు.

● పది రోజుల క్రితం హనుమకొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ అధికారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీపై ఈడీ కేసు నమోదైందని, దిల్లీలోని కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని వాట్సాప్‌కు కొన్ని పత్రాలను పంపించారు. డబ్బులు ఇస్తే మాఫీ చేస్తానని చెప్పాడు. అనుమానం వచ్చిన ఉద్యోగి తన స్నేహితుడితో విషయం తెలిపాడు. పోలీసులతో నిర్ధారించుకొని నకిలీ అని తేలడంతో డబ్బులు పంపించకుండా జాగ్రత్తపడ్డాడు.

రవాణా మాటున చేతివాటం



ఆర్టీసీ లహరి ఏసీ బస్సు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆర్టీసీ సంస్థ నష్టాలను అధిగమించేందుకు కొత్తగా కార్గో పార్సిల్, కొరియర్ రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా బుకింగ్ అయిన సరకులను రవాణా చేస్తుంది. దీన్ని ఆసరా చేసుకుని కొందరు డ్రైవర్లు ఈ రవాణా మాటున చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇటీవల ఓ తనిఖీలో తేలింది. గత నెల 26న బెంగళూరు నుంచి హనుమకొండకు వస్తున్న లహరి ఏసీ బస్సును హైదరాబాద్ వద్ద టీజీఐ అధికారులు తనిఖీ చేశారు. అందులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు ఏ ప్రయాణికుడికి సంబంధంలేని ప్లాస్టిక్ వస్తువులతో నింపిన ఆరు గన్నీ సంచుల మూటలు, వస్తువులతో కూడిన రెండు అట్టపెట్టెలు లభించాయి. అవి ఎక్కడివని డ్రైవర్లను ప్రశ్నించగా ఫొంతనలేని సమాధానం చెప్పారు. కార్గో బుకింగ్ అయి వస్తున్నవని చెప్పారు. వాటికి సంబంధించిన రసీదు చూపించలేదు. వాటిని స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేసి డిపోకు అప్పగించారు. వారి విధులు అప్పగించకుండా విచారణ జరిపించారు. డిపో అధికారులు మరుసటి రోజు నుంచే విధులు కేటాయించడం పలు విమర్శలకు దారితీసింది. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి సరకుల రవాణా చేస్తే ఆ బస్సులు మరమ్మతులకు గురవుతాయని నిపుణులు చెబుతున్నారు. కార్గో బుకింగ్ చేయని ఎలాంటి వస్తువులు, పార్సిల్ కవర్లు రవాణా చేయకూడదనే నిబంధన ఉంది. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావును వివరణ కోరగా లహరి బస్సు డ్రైవర్లపై ఛార్జ్‌షీట్ జారీ చేశామని, విచారణ జరుగుతోందని చెప్పారు. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్, ఆర్చరీ అసోసియేషన్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు మహేశ్‌కుమార్, పోటీల నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.ఫ్లెక్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్ జావలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లాన్‌లో స్వర్ణం, గణేశ్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

మరో రికార్డే లక్ష్యంగా సాధన

పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి చాలారోజుల తర్వాత వరంగల్ వచ్చింది. అథ్లెట్లు దీప్తిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దీప్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2025లో జరిగే వరల్డ్ అథ్లెటిక్స్, 2026లో ఏషియన్ గేమ్స్‌కు సన్నద్ధం అవుతున్నట్లు వివరించారు. ఈసారి నూతన వరల్డ్ రికార్డు నమోదు చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. శారీరక, మానసిక లోపాలను వరంగా మార్చుకోవాలని నాగపురి రమేశ్ తెలిపారు. దీప్తి లోపమే ఆమెకు వరంగా మారిందన్నారు.

పసుపు వర్ణం సీతాకోకచిలుక



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో పసుపు వర్ణం సీతాకోకచిలుక దర్శనమిచ్చింది. సాధారణ సీతాకోకచిలుక కన్నా పెద్దదిగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇది దశలిపట్టు కుటుంబానికి చెందినది.. శాస్త్రీయ నామం ఆంథెరియా పాఫియా.. సాధారణంగా మాత్ అని పిలుస్తారని కాకతీయ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ వత్సవాయి సత్యనారాయణరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు సన్వి



వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన బాలిక పతకాలతో రాణించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు యాదాద్రి భువనగిరిలో రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన అనిశెట్టి సన్వి మూడు విభాగాల్లో పతకాలు సాధించింది. అండర్-14లో 500 మీటర్ల విభాగంలో స్వర్ణం, 1000 మీటర్లలో రజతం, 5000 మీ. విభాగం ఎలిమినేషన్‌లో కాంస్య పతకాలతో అదరగొట్టింది. డిసెంబరు 5 నుంచి 15 వరకు మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. సన్విని ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్‌యాదవ్ అభినందించారు.

డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారంతో ముగిసింది. 18 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు పతకాలను అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుంటే కేసుల దర్యాప్తులో నిందితులను సులువుగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారికి విధి నిర్వహణలో డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడిన ఆరుగురిపై కేసు



నిందితులతో ఎఫ్ఆర్వో శంకర్, సిబ్బంది

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు మండలం జాకారం చెరువు శివారు పంట పొలంలో అడవి పందులకు ఉచ్చులు అమర్చి హతమార్చినట్లు మంగళవారం ఉదయం తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, జాకారానికి చెందిన ఒర్సు కొమురయ్య తన పంట పొలంలో అమర్చిన ఉచ్చులకు అడవి పంది, మనుపిల్లి చిక్కగా వాటిని కాల్చుతూ కనిపించగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అడవి పంది పడిందని, తీసుకెళ్లి విక్రయించాలని కొమురయ్య ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఒర్సు పరశురాం, ముదంగుల రాజు, ఆటకుంట సోమయ్య, ఒర్సు కొమురయ్య, ఒర్సు రాజు ఆటోలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్ చేయడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

ప్రత్యేక డిస్కౌంట్లు.. ఆకట్టుకుంటున్న వాహనాలు

గిర్మాజీపేట : ఓరుగల్లు నగరంలో వాహనాల మార్కెట్ జోరందుకుంది. దసరా దీపావళి పండగల నేపథ్యంలో భారీ డిస్కౌంట్లతో వివిధ ఆటోమొబైల్ కంపెనీలు వాహన ప్రియులను ఆకర్షిస్తున్నాయి. లక్కీ డ్రాతో బంపర్ ఆఫర్లను ప్రకటించాయి. ఎంపికచేసిన మోడల్స్‌పై రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నారు. ఫైనాన్స్ సౌకర్యంతో పాటు, హెల్మెట్, ఐదు లీటర్ల పెట్రోల్, మొబైల్, గ్యాడ్జెట్స్‌ను కంపెనీలు ఉచితంగా అందిస్తున్నాయి. హోండా యాక్సరీస్‌పై ఏడాది వారంటీ ఇస్తున్నారు. ప్రతి వాహనం కొనుగోలుపై స్క్రాచ్ కార్డు, లక్కీడ్రా కూపన్ల ద్వారా కచ్చితమైన బహుమతులు పొందొచ్చు. లక్కీడ్రా విజేతలు సుజుకీ గిక్సర్ 250, యాపిల్ ఐఫోన్లు, హోం థియేటర్లు, బంపర్‌ప్రైజ్ కింద మారుతీ సుజుకీ కారును గెలుచుకునే అవకాశం ఉంది. ప్రతి బైక్ కొనుగోలుపై ఎల్ఈడీ స్మార్ట్ టీవీ ఉచితంగా పొందొచ్చు. పండగల వేళ వాహన కొనుగోలుదారుల ఇళ్లలో సంబరాలు నిండేలా బహుమతులు అందుకోవచ్చు. ఆధునిక ఫీచర్లతో కార్లు, యువత మనసును దోచేలా బైకులు, మోపెడ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. రెడీమేడ్ వస్త్రాలు లేటెస్ట్ వెరైటీ డిజైన్లు, సరికొత్త స్టాకుతో ఆకట్టుకుంటున్నాయి.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానం వచ్చే ఏడాది మార్చి 29న ఖాళీ అవుతున్నందున, ఆ స్థానాన్ని భర్తీ చేయడం కోసం పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన చేయాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం తప్పనిసరిగా ఉపాధ్యాయుల ఫారం 19 ప్రకారం.. నవంబరు 6లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాలనాధికారి పాల్గొన్నారు.

16న 'సీఎం కప్ టార్చ్ రిలే'

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 16న జరిగే 'సీఎం కప్ టార్చ్ రిలే' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు పాలనాధికారి సంధ్యారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, ఇతర క్రీడా సంఘాల నిర్వాహకులతో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. 'టార్చ్ రిలే' నిర్వహణలో భాగంగా ఆయా శాఖల అధికారులు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. డీసీపీ రవీందర్, జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంస్య విజేతకు కలెక్టర్ అభినందన

వరంగల్ కలెక్టరేట్: ఇటీవల పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజీ దీప్తిని, ఆమె గురువు ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేశ్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ డా.సత్యశారద అభినందించారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



ఎంపీ డా.కావ్యను కలిసి సత్కరించిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

కరీమాబాద్, న్యూస్‌టుడే: ఈ నెల 12న ఉర్సు రంగలీలా మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు హాజరుకావాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలను కలిసి ఆహ్వానించినట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు తెలిపారు.

కొలువులు సాధించి.. ఆదర్శంగా నిలిచి!

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే పెద్ద విషయం.. అలాంటిది పలువురు బహుళ కొలువులు సాధించి ఆదర్శంగా నిలిచారు. నల్లబెల్లి మండలానికి చెందిన శ్వేత ఏకంగా అయిదు ఉద్యోగాలు సాధించారు. పర్వతగిరి మండలానికి చెందిన యువకుడు నాలుగు కొలువులు కొట్టారు.



శ్వేతకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు రమ, విష్ణు

నల్లబెల్లి, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఒకటి.. ఏకంగా అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వద్లూరి శ్వేత. నల్లబెల్లికి చెందిన వద్లూరి రమ, విష్ణు దంపతుల కుమార్తె శ్వేత స్థానికంగా ఉన్నత విద్య పూర్తి చేసి, వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చదివారు. ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఈ, గేట్ పరీక్షతో ఎంఈ పూర్తి చేసి విశ్వవిద్యాలయం టాపర్‌గా ప్రతిభ చాటింది. గతేడాది అక్టోబరులో వచ్చిన ఏఈఈ ఫలితాలు (బాలికల విభాగం) రాష్ట్ర స్థాయి 7వ ర్యాంకు సాధించారు. ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ కరీంనగర్‌లో ఏఈఈ గెజిటెడ్ కొలువులో ఈ నెల 7న విధుల్లో చేరింది. జనవరి 2024 పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాల్లో బాలికల విభాగం రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు, గతేడాది ఏఈ ఫలితాలు (బాలికల విభాగం) రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకు, ఫిబ్రవరి 2024లో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ సెక్షన్ ఆఫీసర్ (టీబీపీవో) ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో బాలికల విభాగం 14వ ర్యాంకు, నాలుగో జోన్ పరిధిలో అయిదో ర్యాంకు సాధించారు. 2002లో బెంగళూరు కేంద్రంగా విడుదల చేసిన ఏఈ ఫలితాల్లో జాతీయస్థాయిలో టాపర్‌గా నిలిచారు.

సమయం సద్వినియోగం.. విజయ సోపానం: శ్వేత

సమయాన్ని సద్వినియోగం చేసుకొని చదివా. ప్రైవేటు వసతి గృహంలో ఉండి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యా. డిప్లొమా తరగతులు బోధించా. హైటెక్ సిటీలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేశా. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరవలేనిది. సొంత కన్సల్టెన్సీతో బహుళ అంతస్తుల భవనాలు, నిర్మాణాలకు నూతన డిజైన్‌లు అందించడమే నా లక్ష్యం.

డీఎస్సీలో మెరిసిన ఉప్పరపల్లి యువత

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పరపల్లికి చెందిన 8 మంది డీఎస్సీలో ప్రతిభ చాటి సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగాలు సాధించారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారి తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కుటుంబ కష్టాలు చూసి ప్రభుత్వ కొలువు సాధించి వారి శ్రమకు కానుకగా అందించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. అడ్డంకులు దాటి ఉద్యోగాలు సాధించారు. జిల్లాలో కోన్‌రెడ్డి సమత 8వ, కుక్కల శ్రుతి 22, బోడ దివ్య 34, సంగెం కార్తీక్ 83, మేరుగు హరి 136, పల్లకొండ శిల్ప 212, పులచేరు మహేష్ 240, బొమ్మెర సతీష్ ప్రత్యేక కోటాలో జిల్లా రెండో ర్యాంకు సాధించారు. స్థానికత ప్రకారం మేరుగు హరి మహబూబాబాద్ జిల్లా మిగతా అందరూ వరంగల్ జిల్లాలో ఉద్యోగాలు పొందనున్నారు.

భార్యాభర్తల ప్రతిభ



రంజిత్- రోజా దంపతులు

చెన్నారావుపేట: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన రాయరాకుల రోజా- రంజిత్ దంపతులు కష్టపడి చదివి డీఎస్సీలో ప్రతిభ చాటారు. రంజిత్ స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 14వ ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ తెలుగులో 9వ ర్యాంకు, రోజా స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రంలో 70వ ర్యాంకు సాధించారు.

పేదరికాన్ని జయించి..



సుకుమార్

పర్వతగిరి(వర్ధన్నపేట), న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబానికి చెందిన మాలోతు సుకుమార్ పట్టుదలతో చదివి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. మండలంలోని దౌలత్‌నగర్ గ్రామ శివారు బాజుతండాకు చెందిన యువకుడు మాలోతు సుకుమార్ వరంగల్ నిట్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఒకటి కాదు.. రెండు కాదు.. వరుసగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జేఈఈ, పాలిటెక్నిక్ లెక్చరర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఏఈఈ, ఏఈ ఉద్యోగాలను సాధించారు. తనకు ఇష్టమైన పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేయడానికి సుకుమార్ సుముఖంగా ఉన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట నుంచి దమ్మన్నపేట వెళ్లే దారిలో ఉన్న డివైడర్ మధ్యలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ సమస్యను 'న్యూస్‌టుడే' మున్సిపల్ కమిషనర్ జోనా దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందితో పిచ్చి మొక్కలు తొలగించారు.

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు



గీసుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని ఊకల్‌హవేలీలోని శ్రీనాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సునంద దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షలు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఆలయ ప్రధాన పూజారి సుదర్శనాచార్యులకు ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడంతో ఎమ్మెల్యే పూజారిని సన్మానించారు. కార్యక్రమంలో సౌజన్య, కొమురారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండుగా చీలిన దసరా ఉత్సవ కమిటీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ కాశీబుగ్గ దసరా ఉత్సవ కమిటీ రావణ వధ నిర్వహణ కోసం చేస్తున్న వసూళ్ల పర్వంపై పాలకవర్గం, కమిటీ సభ్యుల మధ్య గొడవ జరిగింది. కాశీబుగ్గలోని దసరా ఉత్సవ కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అంతర్గత సమావేశంలో వసూళ్ల లెక్కలు చెప్పాలని సభ్యులు కమిటీ పెద్దలను ప్రశ్నించడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో ఉత్సవ సమితి రెండు వర్గాలుగా చీలిపోయింది.



రంగశాయిపేట శ్రీవీరాంజనేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో..



రాయపర్తిలో.. గంట రవికుమార్, తదితరులు

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. దుర్గామాత మండపాల వద్ద కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఖిలావరంగల్ మధ్యకోటలో మంగళవారం రాత్రి దుర్గామాత విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. కరీమాబాద్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితా సహస్రనామ, సౌందర్య లహరి పారాయణం నిర్వహించారు. శివనగర్‌లోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో మహిళలు సామూహిక అనఘాష్టమి వ్రతం ఆచరించారు. రాయపర్తి మండల కేంద్రంలోని రామాలయంలో అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. భాజపా జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం



ఖిలావరంగల్ మధ్యకోటలో దుర్గామాత ఊరేగింపు



నల్లబెల్లిలో లక్ష్మీదేవి అలంకరణలో...



ఖానాపురంలో మహాలక్ష్మీదేవిగా..



నర్సంపేటలో..



ఎల్లాయిగూడెంలో..



ముగ్దుంపురంలో



నర్సంపేటలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో చండీ హోమం



నర్సంపేట డిపో ఆవరణలో.. డీఎం ప్రసూనలక్ష్మి, మహిళా ఉద్యోగులు



ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో..

సంప్రదాయానికి ప్రతీక.. ఔన్నత్యానికి సూచిక

వరంగల్ కలెక్టరేట్, మట్టెవాడ: ఎంజీఎం ఆసుపత్రి, గీసుకొండ న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక, ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక బతుకమ్మ పండగ అని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్, రెవెన్యూ, నాలుగో తరగతి ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. జిల్లాలోని అన్నిశాఖల మహిళా ఉద్యోగినులు కలిసి అందంగా పేర్చిన బతుకమ్మలను పరిశీలించారు. ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు హైమావతి, పుష్పలత, భాగ్యలక్ష్మి, టీజీవో, టీఎన్జీవోస్ ప్రతినిధులు పాల్గొన్నారు. వరంగల్ చౌరస్తాలోని ఓ వేడుకల మందిరంలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మ ఆడారు. పర్వతగిరిలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు.



కలెక్టరేట్ ఆవరణలో అధికారులు



బల్దియా కార్యాలయం ఆవరణలో..



పర్వతగిరిలో బతుకమ్మలతో మహిళా అధికారులు



వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో..

విష జ్వరంతో ఒకరి మృతి



సాంబనర్సయ్య (పాతచిత్రం)

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మహేశ్వరానికి చెందిన దేనబోయిన సాంబనర్సయ్య (64) విష జ్వరంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. సాంబనర్సయ్య కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానికంగా చికిత్స పొందాడు. జ్వరం తీవ్రం కావడంతో రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సాంబనర్సయ్య వైద్య పరీక్షల రిపోర్టులు ఇంకా రాలేదని నర్సంపేట మండల వైద్యాధికారి డా.అరుణ్‌చంద్ర తెలిపారు.

చికిత్స పొందుతూ గొర్రెలకాపరి..

జాన్‌పాక(గీసుకొండ), న్యూస్‌టుడే: మద్యం మత్తులో గొర్రెలకు వేసే మందును తాగి మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన సింగరబోయిన కుమారస్వామి(60) మంగళవారం మృతిచెందాడు. స్థానిక ఎస్సై కుమార్ కథనం ప్రకారం..కుమారస్వామి గొర్రెలు కాస్తుంటాడు. ఈ నెల 5న మద్యం మత్తులో గొర్రెలకు వేసే డురోసిన్ డీఎస్ అనే మందును తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన మండల మల్లయ్య సైకిల్‌పై వెళ్తుండగా చెన్నారావుపేట శివారులో జల్లి గ్రామానికి చెందిన రబ్బాని ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీ కొట్టడంతో మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు.


తప్పిపోయిన బాలుడి అప్పగింత

రంగశాయిపేట: ఓ సిటీ క్రిస్టియన్ కాలనీకి చెందిన ఎండీ.హరీల్(3) మంగళవారం ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ తప్పిపోయాడు. తండ్రి జమీల్ మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందించారు. ఏరియాలో పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి.. మూడు గంటల వ్యవధిలో బాలుడిని గుర్తించి, ఎస్సై రవీందర్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎరువుల నిల్వలు పరిశీలన

గీసుకొండ, న్యూస్‌టుడే: రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన పత్తితో పాటు ధాన్యాన్ని తీసుకురావాలని జిల్లా వ్యవసాయాధికారి కె.అనురాధ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం కోనాయమాకులలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. పత్తికి యూరియా బస్తాల సంచులను వాడొద్దని దీంతో పత్తి నాణ్యత దెబ్బతింటుందన్నారు. ధాన్యంలో తాలు ఇతర ధాన్యం గింజలు లేకుండా చూసి కేంద్రాలకు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్‌బాబు, ఏఈవోలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు పార్థివదేహం అప్పగింత



గోపాల్‌రావు(పాతచిత్రం)

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ కొత్తవాడకు చెందిన విష్ణుదాస్ గోపాల్‌రావు(65) అనారోగ్యంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యుల అంగీకారంతో నర్సంపేట వైద్య కళాశాల అనాటమీ విభాగానికి అప్పగించినట్లు తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. మృతుడి నేత్ర, శరీరదానం చేయడానికి అతని కుటుంబ సభ్యులు, సోదరులు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్‌రావు స్వచ్ఛందంగా ముందుకొచ్చారన్నారు. నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.మోహన్‌దాసు, అనాటమీ విభాగం ప్రొఫెసర్ డా.స్రవంతి, సిబ్బంది, అసోసియేషన్ ప్రతినిధులు రాజమౌళి, శంకర్‌రావుయాదవ్, డా.రాజేంద్రప్రసాద్, మోహినుద్దీన్ తదితరులున్నారు.

వన్యప్రాణుల రక్షణకు కృషి



పాకాలలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు

ఖానాపురం, న్యూస్‌టుడే: వన్యప్రాణులు, వన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎఫ్ఆర్వో రవికిరణ్ అన్నారు. మంగళవారం వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా పాకాలలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జీవ వైవిధ్య కేంద్రమైన పాకాలలో ప్లాస్టిక్‌ను వాడొద్దన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రీనా, బీటు అధికారులు సుధాకర్, రమేష్, సిబ్బంది రవి, విజయ్ పాల్గొన్నారు.

'బోధనలో కొత్త విధానాలను అన్వేషించాలి'

నర్సంపేట, న్యూస్‌టుడే: బోధనలో నిత్యం కొత్త విధానాలను అన్వేషిస్తూ పిల్లలలో ఉన్న ప్రతిభను వెలికి తీయడమే నిజమైన విద్య అని ప్రముఖ విద్యావేత్త సీఏ ప్రసాద్ అన్నారు. నర్సంపేటలోని లీడ్ గ్రంథాలయంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు కాసుల రవికుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన 'చదువులు కొత్తదారులు' సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇటీవల అమెరికాలో జరిగిన వర్క్‌షాప్ అనుభవాలను పిల్లలు, వారి తల్లిదండ్రులకు వివరించారు. ఉన్నత విద్యతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు జగదీశ్వర్ తెలిపారు. అనంతరం సీఏ ప్రసాద్‌ను పలువురు సన్మానించి పుస్తకాలను బహూకరించారు.

నర్సంపేట నియోజకవర్గం

పండగ నిర్వహణలో ఖర్చు తగ్గించాలి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో బతుకమ్మ, దసరా పండగ నిర్వహణలో ఖర్చు తగ్గించి ఏర్పాట్లు చేసుకోవాలని నర్సంపేట ఎంపీడీవో శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సంపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సద్దుల బతుకమ్మ, దసరా పండగ ఏర్పాట్లపై కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్తు, సౌండ్స్, పారిశుద్ధ్యం పనులను పూర్తి చేయాలన్నారు. పంచాయతీల్లో నిధుల కొరత దృష్ట్యా ఖర్చు చేయాలన్నారు. ఎంపీవో రామ్మోహన్ ఉన్నారు.

బంజారాల ఉనికిని ప్రపంచానికి చాటిన నేత మోదీ



సమావేశంలో ప్రసంగిస్తున్న సీతారాంనాయక్

నర్సంపేట, న్యూస్‌టుడే: మరుగున పడిన బంజారాల ఇతిహాసాన్ని వెలికి తీసి తమ ఉనికిని ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడు ప్రధాని మోదీ అని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. నర్సంపేటలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాలను 8వ షెడ్యూల్‌లో చేర్చి తెలంగాణలో ఆధ్యాత్మిక భవన్ నిర్మాణం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, ప్రతాప్, ఆంజనేయులు, వీరన్న, రామచంద్రారెడ్డి, గోల్యా పాల్గొన్నారు.

గ్రామాల విలీనం విరమించుకోవాలి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సంపేట పురపాలికలో సమీప గ్రామాల విలీన ప్రక్రియను విరమించుకోవాలని ఎంసీపీఐయు మండల కార్యదర్శి రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట ఎంపీడీవో శ్రీనివాసరావుకు మంగళవారం ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందించారు. సదానందం, సాంబయ్య, రమేష్, నాగరాజు, సుధ ఉన్నారు.

పంచాయతీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



నెక్కొండ, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్ధమైన ఘటన మండలంలోని పనికర గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రమాదంలో రికార్డులు, బీరువా, 15 కుర్చీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. గ్రామస్థులు స్పందించి మంటలను అదుపు చేశారు. ఎంపీడీవో దయాకర్, ఆర్ఐ నరేందర్ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామానికి సంబంధించిన ఐదేళ్ల ఇంటి పన్ను రసీదులు, జనన మరణ, ఇన్‌వార్డు, ఔట్‌వార్డు తదితర రికార్డులు కాలిపోయినట్లు గ్రామ ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తెలిపారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు ఎంపీడీవో తెలిపారు. విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు.